Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# కోర్టు మా అధికారాలు హరించలేదు

దివాలా స్మృతి పరిష్కారానికి త్వరలో నూతన మార్గదర్శకాలు

ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

ముంబయి: దివాలా పరిష్కారానికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) త్వరలో నూతన మార్గదర్శకాలను జారీ చేయనుంది. ఆర్‌బీఐ గతంలో ఇచ్చిన నిబంధనావళిని సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి విదితమే. దివాలా పరిష్కారాలపై సుప్రీంకోర్టు తమ అధికారాలను పరిమితం చేయలేదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఇక్కడ చెప్పారు. కోర్టు తీర్పునకు అనుగుణంగా సవరించిన మార్గదర్శకాలను త్వరలో జారీ చేస్తామని వెల్లడించారు. 'మా అధికారాలను సుప్రీంకోర్టు హరించలేదు. వాటిని స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. అయితే అమలు ప్రక్రియను ఒక పద్ధతిలో చేయాల్సి ఉంది' అని దాస్ తెలిపారు. 'పార్లమెంటు మాకు ఇచ్చిన అధికారాలను అమలు చేస్తాం. దివాలా పరిష్కారాలు వేగంగా అమలయ్యేలా చూస్తాం. ఇందుకోసం సవరించిన మార్గదర్శకాలను ఆలస్యం చేయకుండా, త్వరలో విడుదల చేస్తాం. దివాలా పరిష్కార ప్రక్రియ సజావుగా జరిగేలా, రుణ క్రమశిక్షణ గాడి తప్పకుండా చూస్తాం' అని ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు.

సెక్షన్ 35ఏఏ కొనసాగుతుంది

'ఫిబ్రవరి 12 నాటి ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం.. అందరు ఎగవేతదార్ల విషయంలో, పరిధికి మించి ఆర్‌బీఐ అధికారాలను అమలు చేస్తోందని సుప్రీంకోర్టు  వ్యాఖ్యానించిందనే విశ్లేషణలు వినిపించాయి. కాని బ్యాంకింగ్ పరిష్కార చట్టంలోని 35ఏఏ సెక్షన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే ఆ సెక్షన్ కింద అందరిపై చర్చలు వద్దని, కొన్ని ప్రత్యేక రుణ ఎగవేతలపై ప్రత్యేక పద్ధతిని అనుసరించాలని సూచించింది. సెక్షన్ 35ఏఏ కొనసాగుతుంది' అని దాస్ వివరించారు.

70 కంపెనీల ఫిర్యాదుతో..

రుణఆస్తులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో, విద్యుత్తు, నౌకాయానం, జౌళి రంగాలకు చెందిన 70 కంపెనీలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. రూ.2,000 కోట్లకు మించిన రుణాల విషయంలో గడువులోగా కిస్తీ చెల్లించకపోతే, ఆ తరవాత ఒక్క రోజు దాటినా, 180 రోజుల్లో పరిష్కార ప్రణాళిక అమలు చేయాలని, అప్పటికీ వసూలు కాకపోతే, దివాలా ప్రక్రియకు చేర్చాలంటూ ఆర్‌బీఐ ఫిబ్రవరి 12న జారీచేసిన ఆదేశాలను వీరు సవాలు చేశారు. 'సదరు ఆదేశాలు, అధికారాల పరిధిని అతిక్రమిస్తున్నట్లు' ఉన్నాయని న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.నారిమన్, వినీత్ శరణ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది.

* ఈ తీర్పు వల్ల బ్యాంకులకు రూ.2.2 లక్షల కోట్ల బకాయిలున్న 34 విద్యుత్తు కంపెనీలకు ఉపశమనం లభించనుంది. ఈ కంపెనీలు దివాలా స్మృతికి చేరకుండా, బ్యాంకులతో రుణ పునర్నిర్మాణానికి సంప్రదింపులు ప్రారంభించే వీలు కలుగుతుంది.

అన్ని వర్గాలతో సంప్రదింపులు?

దీనిపై సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపి, చట్టబద్ధంగా నిలిచేలా, సవరించిన నిబంధనలను ఆర్‌బీఐ విడుదల చేస్తుందని సమాచారం. న్యాయస్థానం తీర్పును కనుక ఆర్‌బీఐ సవాలు చేస్తే, దివాలా స్మృతి పరిష్కార నిబంధనలు సస్పెన్షన్‌కు గురయ్యే అవకాశం ఉంది. అందువల్ల మొత్తం ప్రక్రియను మొదటినుంచి ప్రారంభించాల్సి రావచ్చు.

## అంచనాలకు అనుగుణంగానే రేట్ల కోత



రెపోరేటులో 25 బేసిస్ పాయింట్ల కోత హర్షణీయం. మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ఆర్‌బీఐ వ్యవహరించింది. వృద్ధిరేటు అంచనాలను తగ్గించడం, ద్రవ్యోల్బణ లక్ష్యాలు అంతర్జాతీయ ప్రభావాల వల్లే. సాధారణం కంటే వర్షపాతం తక్కువగా ఉంటుందనే అంచనాలు, ఈ అనిశ్చితిని మరింత పెంచుతాయి. బ్యాంకులు అదనపు నగదును విడుదల చేసేందుకు అదనపు 2 శాతం ఎస్‌ఎల్‌ఆర్, ఎల్‌సీఆర్ నిబంధన ఉపయోగపడుతుంది. సెకండరీ కార్పొరేట్ రుణ విపణి, గృహరుణ సెక్యూరిటైజేషన్ సరైన సమయంలో ప్రకటించిన చర్య.

- రజనీశ్ కుమార్, ఎస్‌బీఐ ఛైర్మన్

## బ్యాంకులు బదిలీ చేయాలి



‘పారిశ్రామిక ప్రగతి, ఎగుమతుల్లో వృద్ధి నెమ్మదించడం, ద్రవ్యలభ్యత ఆందోళనల నేపథ్యంలో కీలక రేట్ల కోత భారీగానే ఉంటుందని అనుకున్నాం. పైగా ద్రవ్యోల్బణం పరిమిత స్థాయిలో ఉండటంతో ఆ దిశగానే నిర్ణయం తీసుకుంటుందని భావించాం. ఆర్‌బీఐ కీలక రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని బ్యాంకులు కూడా బదిలీ చేస్తేనే వృద్ధికి ఊతం లభిస్తుంది’

- సందీప్ సోమాని, ప్రెసిడెంట్, ఫిక్కీ